ఇంధన పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

● సందీప్‌కుమార్ సుల్తానియా

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): ఇంధన సామర్థ్యం, పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పేర్కొన్నారు. జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాల నేపథ్యంలో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషీయన్సీ(బీఈఈ) దక్షిణ భారత మీడియా సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్కో ఎండీ అనీలతో కలిసి ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇంధన సామర్థ్య కార్యక్రమాలకు తోడ్పాటునిస్తున్న బీఈఈ, ఈఈఎస్ఎల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

క్రైస్తవులకు భద్రత: సీఎం

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో క్రైస్తవ సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి భద్రత కల్పిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లో మార్థోమ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. క్రైస్తవుల భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న విషయాన్ని తెలియజేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని వెల్లడించారు. ఆ మేరకు సీఎం సందేశాన్ని క్రైస్తవులకు తెలియజేస్తున్నానని పొంగులేటి వివరించారు. క్రైస్తవులు విద్య, వైద్య రంగాల్లో నిస్వార్థ సేవలు అందిస్తున్నారని కొనియాడారు.

ప్లేటు భోజనం 32 వేలు?

మొదటిపేజీ తరువాయి...

చెందిన హోటల్ తాజ్‌కృష్ణ నిర్వాహకులు ఆలయ అధికారులకు పంపిన బిల్లు ఇది. భోజనాలతోపాటు పట్టుపంచెలు, ఇతర మర్యాదల కోసం పెట్టిన మొత్తం ఖర్చు సింపుల్‌గా రూ.కోటీ 70 లక్షలు! ఇంత బిల్లు చెల్లించడం తమ వల్ల కాదని రాజన్న ఆలయ అధికారులు చెప్తుండగా, ఈ 'పేమెంట్ చేయాల్సిందే'నంటూ రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఒక ఉన్నతాధికారి ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. దీంతో దిక్కుతోచని ఆలయ అధికారులు ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. నిత్యం కడుపు కాల్చుకొని పైసాపైసా కూడబెడుతున్నామని పదేపదే చెప్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఖర్చుపై ఎలా స్పందిస్తారో మరి.

ఆలయ నిబంధనలూ మంట గలిపారు!

ప్రజాపాలన విజయోత్సవాల పేరిట గత నెల 20న వేములవాడలో కాంగ్రెస్ ప్రభుత్వం బహిరంగ సభ నిర్వహించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు వేములవాడకు వచ్చారు. వీరితోపాటు ఇతర వీఐపీలకు అధికారిక లాంఛనాలతో స్వాగతం పలికిన అధికారులు ఆ తర్వాత రాజన్న దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా వంద మంది వీఐపీలకు భోజనాలు పెట్టేందుకు హైదరాబాద్ నుంచి తాజ్ హోటల్ సిబ్బంది వచ్చారు. దేవస్థానం చైర్మన్‌కు చెందిన చాంబర్‌నే ఫైవ్‌స్టార్ హోటల్‌గా మలిచి అక్కడే వండి భోజనాలు పెట్టారు. అందులోకి మీడియాను అనుమతించలేదు. కేవలం ఎంపికచేసిన వీఐపీలు మాత్రమే వెళ్లారు. దేవాలయానికి ఆనుకొని ఉన్న చైర్మన్ చాంబర్‌ను ఒక హోటల్‌గా మార్చడం నిబంధనలకు విరుద్ధం. సదరు హోటల్ నిర్వాహకులు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పెట్టారు. మొత్తం వంద మంది వీఐపీలకు వంట చేసి భోజనాలు పెట్టినట్టు చెప్పిన సదరు హోటల్ యాజమాన్యం, అందుకు సంబంధించిన బిల్లులను తాజాగా రాజన్న ఆలయ ఈవోకు పంపినట్టు అలయ అధికారుల ద్వారా తెలిసింది. అందులో భోజనం ఖర్చు రూ.17 లక్షలు, ట్రాన్స్‌పోర్ట్, వెయిటర్, భోజనాల కోసం వేసిన డెకరేషన్ ఖర్చులు కలిపి రూ.15 లక్షలుగా పేర్కొన్నది. వంద మంది భోజనాల ఖర్చు కింద రూ.32 లక్షలు చెల్లించాలని పేర్కొంటూ బిల్లులు పంపారనేది అత్యంత విశ్వసనీయ సమాచారం. అంటే ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులతో కలిపి చూస్తే ఒక్కో వీఐపీ ఆ రోజు చేసిన భోజనం ఖరీదు రూ.32 వేలు అన్నమాట!

10 వేలతో పట్టు పంచెలు?

సాధారణంగా ముఖ్యమంత్రితోపాటు ఇతర మంత్రులు వచ్చినప్పుడు.. దేవాదాయ శాఖ కొన్ని సంప్రదాయాలు పాటించాల్సి ఉంటుంది. ఇక్కడ అది శ్రుతి మించింది. తొలుత ముఖ్యమంత్రికి రూ.పది వేల విలువైన పట్టుపంచె, మంత్రులు, ఇతర వీఐపీలకు అంత కంటే తక్కువ ఖర్చుతో పట్టుపంచెలను తెప్పించినట్టు తెలిసింది. కానీ, జిల్లాకు చెందిన ఒక ఉన్నతాధికారి జోక్యం చేసుకొని, ముఖ్యమంత్రి తరహాలోనే మంత్రులకు, వీఐపీలకు కూడా పట్టుపంచెలు పెట్టాలని హుకుం జారీ చేయడంతో ఆలయ అధికారులు అప్పటికప్పుడు అదే ధరతో కూడిన పట్టువస్త్రాలు తెప్పించినట్టు సమాచారం. అంతేకాదు, ముఖ్యమంత్రి వస్తున్నారని పేర్కొంటూ.. తాగే గ్లాస్ నుంచి తినే పల్లెం వరకు, కుర్చీ నుంచి టేబల్ వరకు.. ప్రతి వస్తువు కొత్తది తెప్పించినట్టు విశ్వసనీయ సమాచారం. అందుకోసం సుమారు రూ.కోటి నలభై లక్షల వరకు వెచ్చించినట్టు తెలుస్తున్నది. అంటే ముఖ్యమంత్రి రాజన్న దర్శనానికి వచ్చిన సందర్భంగా భోజనాలు, ఇతర వస్తుల ఖరీదు కలసి రూ.కోటీ 70 లక్షలకుపైగా ఖర్చు పెట్టినట్టు సమాచారం. ఇవన్నీ బహిరంగ సభ వద్ద జరిగిన ఖర్చులతో సంబంధం లేకుండా కేవలం ఆలయ ప్రాంగణ పరిధిలో జరిగిన ఖర్చులు మాత్రమేనని తెలుస్తున్నది.

తెరపైకి పంచాయితీ?

భోజన బిల్లులు రూ.32 లక్షలు కావడంతో అసలు పంచాయితీ తెరపైకి వచ్చినట్టు సమాచారం. ఈ బిల్లులు రాజన్న ఆలయం నుంచి చెల్లిస్తారని ఒక ఉన్నతాధికారి చెప్పిన మేరకు హోటల్ యాజమాన్యం రాజన్న ఆలయ ఈవోకు బిల్లులు పంపించింది. అయితే భోజనాలకు ఇంత పెద్ద మొత్తంలో బిల్లులు చెల్లించడం తమ వల్ల కాదంటూ దేవాలయ అధికారులు తేల్చిచెప్పగా.. జిల్లాకు చెందిన ఒక ఉన్నతాధికారి 'లేదు.. లేదు. కచ్చితంగా చెల్లించాలి' అని ఆదేశించినట్టు తెలుస్తున్నది. ఆలయ అధికారులు మాత్రం ఆ బిల్లులు చెల్లించకుండా.. ఫైల్ తయారుచేసి రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌కు పంపించినట్టు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం అందుకు సంబంధించిన ఫైలు కలెక్టర్ వద్ద పరిశీలనలో ఉన్నది. ఈ బిల్లులు కలెక్టర్ తన ఖాతా నుంచి చెల్లిస్తారా? లేక తిరిగి రాజన్న ఆలయానికి పంపిస్తారా? అనే అంశంపై చర్చ నడుస్తున్నది. ముఖ్యమంత్రి రాక సందర్భంగా ప్రొటోకాల్ పాటించడం సహజమే అయినా ఏకంగా ఫైవ్‌స్టార్ హోటల్‌నే దేవస్థానం పరిధిలోకి తెప్పించడం, లక్షల ఖర్చులతో భోజనాలు చేయడం ఎంతవరకు సమంజసమని దేవాలయ అధికారులే చర్చించుకుంటున్నారు. గతంలో అనేకమంది సీఎంలు వచ్చి వెళ్లారని, ఏనాడూ ఇటువంటి పరిస్థితి చూడలేదని ఆలయ వర్గాలు చెప్తున్నాయి. ఒక ఉన్నతాధికారి ఆదేశాల మేరకు అనుమతి లేకుండా కొనుగోలు చేసిన ఫర్నీచర్‌కు కూడా బిల్లులు ఎలా చెల్లించాలో అర్థం కావడం లేదని అధికారులు లోలోన మథనపడుతున్నట్టు తెలుస్తున్నది. మొత్తంగా ఈ సమస్య ఎటువైపు దారితీస్తుందోనన్న ఆందోళన రాజన్న ఆలయ ఉద్యోగుల్లో వ్యక్తం అవుతుండగా.. వంద మంది వీఐపీలకు ఏకంగా రూ.32 లక్షలు ఖర్చు పెట్టి భోజనాలు పెట్టడం అవసరమా? అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

అమ్మకానికి హౌజింగ్ బోర్డు భూములు

- కంపెనీల కబ్జాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భూములు
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్యాక్రాంతమైన ఆస్తులు
- ఇంటి దొంగల సహకారంతో బడా కంపెనీల దౌర్జన్యం
- వెంచర్ల పేరుతో ప్రభుత్వ ఎసరు
- కేసీఆర్ హయాంలో సంరక్షణ

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ఆస్తులను ఆంధ్రా పాలకులు తమ అనుయాయులకు అప్పనంగా దోచిపెట్టారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో హౌజింగ్ బోర్డు ఆధ్వర్యంలో ప్రభుత్వ భూములు ప్రైవేటు కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోయాయి. హైదరాబాద్, చుట్టుపక్కల హౌజింగ్ బోర్డు ప్రైవేటు కంపెనీల భాగస్వామ్యంతో గృహనిర్మాణ ప్రాజెక్టులు చేపట్టి, విక్రయించింది. కానీ బోర్డులోని అవినీతి అధికారులు కంపెనీలతో కుమ్మక్కు కావడంతో భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ప్రభుత్వానికి ఆదాయం రాకపోగా హౌజింగ్ బోర్డు నిండా మునిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వీటిని స్వాధీనానికి, సంరక్షించేందుకు తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చర్యలు చేపట్టారు. ప్రస్తుత సర్కారు ఆదాయం కోసం భూముల అమ్మకానికి సిద్ధమైంది.

దిల్ భూములపై తర్జన భర్జన...

2007లో డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ల్యాండ్ హోల్డింగ్స్ లిమిటెడ్ ఏర్పాటైంది. టౌన్‌షిప్‌లు, జాయింట్ వెంచర్ ప్రాజక్టులు చేపట్టే ఉద్దేశంతో దీన్ని ఏర్పాటు చేశారు. దిల్ కింద తెలంగాణలోని ఆరు జిల్లాల్లో 6,800ఎకరాల భూములు, విశాఖలో 150ఎకరాల భూములు ఉండేవి. 1890ఎకరాలు ప్రాజక్టులకు వినియోగం, విక్రయం జరగగా, 5000ఎకరాలు దిల్ ఆధీనంలో ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ భూములను బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో జీఓ ద్వారా వెనక్కు తీసుకుంది. ఈ నిర్ణయంపై ఏపీ ప్రభుత్వం కోర్టును ఆశ్రయించింది. భూము లు తెలంగాణలో ఉన్నందున ఏపీకి ఎటువంటి హక్కులు ఉండవని తెలంగాణ వాదించింది. ఈ భూముల విలువ రూ.70వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా.

కేసీఆర్ హయాంలో రక్షణ చర్యలు

అన్యాక్రాంతమైన హౌసింగ్ బోర్డు భూములను తిరిగి దక్కించుకునేందుకు గతంలో బీఆర్ఎస్ సర్కారు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ భూముల సంరక్షణకు పూనుకున్నది. భూములకు ప్రహరీగోడల నిర్మాణాన్ని చేపట్టింది. ప్రస్తుత ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకుని, అమ్మకానికి పెట్టేందుకు ప్రణాళికలు రచించింది. ఇప్పటికే గుర్తించిన భూములకు 28వేల మీటర్ల పొడవున ప్రహారీ గోడలు నిర్మించారు. భూముల స్వాధీనంలో అధికారులు పోలీసుల సాయం తీసుకుంటున్నారు.

సీకేడీ క్లినిక్ ప్రారంభోత్సవంలో దేశికేంద్రస్వామితో యశోద గ్రూప్ చైర్మన్ తదితరులు

యశోదలో క్రానిక్ కిడ్నీ డిసీజ్ క్లినిక్ ప్రారంభం

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తేతెలంగాణ): హైదరాబాద్ హైటెక్‌సిటీలోని యశోద హాస్పిటల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సీకేడీ) క్లినిక్‌ను జగద్గురువు శివరాత్రి దేశికేంద్ర మహాస్వామీజీతో కలిసి యశోద హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ గోరుకంటి రవీందర్‌రావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ మన దేశ జనాభాలో 17 శాతం మంది మూత్రపిండాల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. ఏటా దాదాపు 5 లక్షల మంది డయాలసిస్ దశకు చేరుకుంటున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధిగ్రస్తుల కోసం ఈ క్లినిక్‌ను ఏర్పాటుచేసినట్టు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని జనాభాలో 20 శాతం మందిలో ఈ క్రానిక్ కిడ్నీ డిసీజ్ ప్రాబల్యం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్ దేవదాస్, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి, నెఫ్రాలజీ స్పెషలిస్టు రాజశేఖర చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు

ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న ట్రాన్స్‌కో

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు సరఫరాలో నాణ్యమైన సేవలకు తెలంగాణ లోడ్ డిస్పాచ్ సెంటర్ జాతీయ స్థాయి ఎల్‌డీసీ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నది. ఐఐటీ ఇండోర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సెంటల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) చైర్‌పర్సన్ ఘన్‌శ్యామ్ ప్రసాద్, గ్రిడ్ ఇండియా సీఎండీ నర్సింహన్‌ల చేతుల మీదుగా ట్రాన్స్‌కో సీఎండీ డీ కృష్ణభాస్కర్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇంధనశాఖ స్పెషల్ సీఎస్ సందీప్‌కుమార్ సుల్తానియా అభినందించారు.

4,893 కేసుల్లో 33.27 కోట్ల రీఫండ్

- సైబర్ నేరాల్లో బాధితులకు ఊరట
- సీఎస్‌బీ డీజీ శిఖా గోయెల్ వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (సీఎస్‌బీ) మరో రికార్డు నెలకొల్పింది. శనివారం నిర్వహించిన జాతీయ మెగాలోక్ అదాలత్‌లో సైబర్ నేరాలకు సంబంధించిన 4,893 కేసుల్లో బాధితులకు రూ.33.27 కోట్లను రీఫండ్‌గా అందించింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని 2,136 కేసుల్లో రూ.12,77,49,117, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని 268 కేసుల్లో రూ.8,84,17,621, రాచకొండ పరిధిలోని 592 కేసుల్లో రూ.4,53,06,114, సీఎస్‌బీ డీల్ చేసిన 60 కేసుల్లో రూ.1,06,49,044, సంగారెడ్డి జిల్లా పరిధిలోని 188 మంది బాధితులకు రూ.98,63,438 రీఫండ్ చేసినట్టు సీఎస్‌బీ డీజీ శిఖా గోయెల్ వెల్లడించారు. తద్వారా గత లోక్ అదాలత్‌లో అందించిన రూ.27.2 కోట్ల రీఫండ్‌ను అధిగమించినట్టు చెప్పారు. ఇందుకు సహకరించిన సీఎస్‌బీ అధికారులు, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ, జిల్లా న్యాయమూర్తులు, మేజిస్ట్రేట్‌లు, డీఎల్ఎస్ఏఎస్‌లు, సీపీలు, ఎస్పీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు 17,210 మంది బాధితులకురూ.155.22 కోట్లు రీఫండ్ చేసినట్టు వెల్లడించారు. ఏదైనా సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 హెల్ప్‌లైన్ ద్వారా లేదా cybercrime.gov.in పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

యాజడే

పిల్లల్లో ఆర్థిక క్రమశిక్షణ ఎలా?

చిన్నచిన్నగా పొదుపు పాఠాలు నేర్పండిలా..

ఈ రోజుల్లో పిల్లలు చాలా చాలా చురుగ్గా ఉంటున్నారు. హింటిస్తే చాలు అల్లుకుపోతున్నారు. ప్రతీ విషయంలో తెలివిగా ఆలోచించి నేర్చుకుంటున్నారు. తల్లిదండ్రులు కాస్త ఓపిగ్గా చెబితే ఆర్థిక క్రమశిక్షణ కూడా అలవాటవుతుంది. మరి పసితనంలోనే పొదుపు పాఠాలు నేర్పుతారా! నిపుణుల సలహాలేమిటి?

ప్రతీ మనిషి తన జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే ఆర్థిక క్రమశిక్షణ కూడా అవసరం. అది చిన్నతనం నుంచే అలవర్చుకుంటే మెరుగైన ఫలితాలను పొందవచ్చు. నిజానికి ఇది ఒకప్పటితో పోల్చితే ఇప్పటి తరాలకు నేర్పడం సులభమనే చెప్పవచ్చు. టెక్నాలజీపరంగా కూడా నేటి పిల్లలు ఎంతో ముందుంటున్నారు. వారికి నచ్చినవిధంగా మనం చెప్పగలిగితే వారి నుంచి అద్భుతాలనే ఆశించవచ్చంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. కానీ మెజారిటీ తల్లిదండ్రులు తమ పిల్లలు.. ఆటలు, చదువు, ఇతరత్రా రంగాల్లోనే రాటుదేలాలని చూస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే శిక్షణను కూడా ఇప్పిస్తున్నారు. అయితే ఇవన్నీ అవసరమైనవే అయినా.. మనీ మేనేజ్‌మెంట్ కూడా చాలాచాలా ముఖ్యమని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. వివేకవంతమైన నిర్ణయాల్లో ఆర్థిక క్రమశిక్షణ కీలకపాత్ర పోషిస్తుందని గుర్తు చేస్తున్నారు. అందుకే ఈ విధంగా ముందుకెళ్లాలంటూ సూచిస్తున్నారు.

పొదుపు

తల్లిదండ్రులు తమ పిల్లలకు పొదుపు విలువను తెలియజేస్తూ పెంచాలి. అప్పుడే బాధ్యతలనేవి తెలిసొస్తాయి. ప్రతి నెలా పిల్లలకు రూ.10 లేదా రూ.20 ఇస్తూ వెళ్లండి. ఇచ్చేటప్పుడే ఆ డబ్బును దాచుకుంటే రేపు వాళ్ల అవసరాలను దానితో ఎలా తీర్చుకోవచ్చో వివరించండి. ఒకవేళ మీకు అవసరమైతే ఆ నగదును అడిగి తీసుకుని, మళ్లీ తిరిగిచ్చేటప్పుడు అదనంగా ఇంకాస్త ఇవ్వండి. దీంతో సంపాదన అంటే ఏంటో కూడా తెలుస్తుంది. ఇలా ఒక ఏడాదిపాటు ఆ పైసలను ఖర్చు చేయకుండా దాచుకోవాలని చెప్పి, అందుకు మద్దతుగా నిలవండి. అప్పుడు ఒక్కసారిగా పోగయ్యే ఆ సొమ్ముతో వారికి అవసరమైనవి కొనివ్వండి. ఇలా మీరే కాదు.. ఇంట్లోని పెద్దవాళ్లు ఎవరిచ్చినా అలాగే దాచుకునేలా అలవాటు చేస్తే మంచి ఫలితాల్నే చూడవచ్చు.

ఖర్చులు

ఆర్థిక క్రమశిక్షణలో పొదుపు ఎలాంటి పాత్ర పోషిస్తుందో.. ఖర్చులూ అలాంటి భూమికనే వహిస్తాయి. అందుకే అవసరాలు, కోరికల మధ్య వ్యత్యాసాన్ని పిల్లలకు తెలియజేయాలి. ఏది అవసరమో, ఏది అనవసరమో తెలియజెప్పాలి. వినకపోతే నచ్చజెప్పాలేగానీ.. తిట్టి, కొట్టి వారిని దారికి తెచ్చుకోవాలనుకుంటే మాత్రం మొదటికే మోసం వస్తుందన్నది మరువద్దు. ఎందుకంటే ఇలాచేస్తే పిల్లలు మొండిగా తయారవుతారు. ఆహారం, పుస్తకాలు అవసరమైనవని.. బొమ్మలు, చిరుతిళ్లు అనవసరమైనవని చెప్పాలి. ఉదాహరణకు ఒక వెయ్యి రూపాయలతో ఓ గేమ్‌ను లేదా స్కూల్ షూస్ కొనవచ్చని చెప్పి, దేనికెంత ప్రాధాన్యమో తెలియపర్చండి. అనవసరంగా, వృథాగా ఖర్చుచేస్తే ఎదురయ్యే పరిణామాలను ప్రాక్టికల్‌గా తెలియజేయండి. చెబితే విన్న దాని కంటే చూస్తే నేర్చుకునేదే ఎక్కువ మరి. కనుక ఇంటి ఆర్థిక విషయాల్లో వీలున్నంత మేరకు మీ పిల్లలని భాగస్వాములని చేయండి.

లక్ష్యాలు

ఆర్థిక లక్ష్యాలు అనేవి చాలా కీలకం. పిల్లలు కోరిన ఓ బొమ్మ కోసమో లేదా మరే ఇతర వస్తువుకైనాసరే దానికయ్యే నగదును ఎలా దాచుకోవాలి, సంపాదించాలన్నదాని కోసం ఓ లక్ష్యాన్ని నిర్దేశించాలి. ఈ లక్ష్య సాధనకు వారి వెన్నంటే ఉంటూ ప్రోత్సహించాలి. ఉదాహరణకు వారికి రూ.1,500 కావాలంటే నెలకు రూ.150 చొప్పున సేవ్ చేసుకునేలా ముందుకు తీసుకెళ్లండి. 10 నెలల్లో రూ.1,500 అందేలా చేస్తే ఆ డబ్బు విలువ, కష్టం, సమయం విలువ కూడా తెలుస్తుంది. పిల్లలో సహనం, ఓపిక పెంపొందించడానికీ ఇది దోహదం చేస్తుంది.

పెట్టుబడి

పిల్లలకు చిన్నప్పట్నుంచే పెట్టుబడి ప్రాధాన్యతను, దానికున్న అవకాశాలనూ తెలియపర్చాలి. సేవింగ్స్ అకౌంట్స్ లేదా సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు (సిప్) మొదలుపెట్టేలా కృషి చేయాలి. సిప్‌లో నెలకు రూ.500 చొప్పున వారు ఇన్వెస్ట్ చేసేలా సహకరించండి. అలా పెడుతూపోయిన నగదు ఏ రకంగా పెరుగుతుందో కూడా వారికి చూపిస్తూ వివరించండి. ఇలా వారిని ఇన్వెస్ట్‌మెంట్ వైపు నడిపిస్తే ప్రతీ రూపాయిని వారు మిగుల్చుకుని, దాన్ని సేవింగ్స్‌లోకి, అలా పెట్టుబడి సాధనాల్లోకి తీసుకెళ్లగలరు.

రిస్కులు-బీమా

జీవితంలో ఊహించని పరిణామాలెన్నో జరుగుతాయి. అందుకే వాటి గురించి కూడా పిల్లలకు చెప్పాలి. ఆస్తుల ధ్వంసం, దొంగతనాలు, ఉద్యోగం కోల్పోవడం వంటివి ఎదురైతే ఏ రకమైన ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయో వివరించాలి. అందుకే ముందు జాగ్రత్తగా ఎమర్జన్సీ ఫండ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించాలి. అలాగే బీమా అవశ్యకతను వివరించాలి. ఆర్థిక ప్రణాళికలో బీమా సైతం ప్రధానమేనని తెలియజెప్పడం ముఖ్యం. జీవిత బీమా, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా ఇలా దేనికదే ముఖ్యమైనది మరి. దేన్నీ నిర్లక్ష్యం చేయకూడదు.

చివరగా..

పిల్లలు తల్లిదండ్రులను చూస్తూ పెరుగుతారు. కాబట్టి మీరు ఆర్థిక క్రమశిక్షణతో ఉంటేనే మీ పిల్లలు కూడా అదే బాటలో నడుస్తారన్నది గుర్తుంచుకోవాలి. మీ పొదుపు, మీ పెట్టుబడులు, మీ ఖర్చులన్నీ వారికి తెలిసేలా చేయండి. దీనివల్ల పారదర్శకత కూడా వస్తుంది. సేవింగ్స్, ఇన్వెస్ట్‌మెంట్స్ ఎంత త్వరగా ప్రారంభిస్తే, ఎంత చిన్న వయసు నుంచే ఆరంభిస్తే అంత లాభాలు ఉంటాయన్నది మరువద్దు.

యూపీఐపై క్రెడిట్ లైన్

ఎలా వాడుకోవాలో తెలుసా?

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. తమ తాజా ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)పై కస్టమర్లకు 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్' సౌకర్యాన్ని కల్పించేందుకు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకూ అనుమతిచ్చింది. నిజానికి గత ఏడాది సెప్టెంబర్‌లోనే యూపీఐపై క్రెడిట్ లైన్ సదుపాయం మొదలైంది. అయితే ఇప్పటిదాకా షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల్లోనే ఆ సేవలు అందుబాటులో ఉన్నాయి. కానీ ఇప్పుడు చిన్నతరహా బ్యాంకులైన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకూ ఆర్బీఐ ఈ వీలు కల్పించింది. ఈ నిర్ణయం యూపీఐ యూజర్లకు మరింత కలిసి రానున్నది. త్వరలోనే ఇందుకు సంబంధించి స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకు విధివిధానాలను ఆర్బీఐ ప్రకటించనున్నది. కాగా, అసలు ఈ యూపీఐపై 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్' అంటే ఏమిటి? ఎలా ఈ సౌకర్యాన్ని రుణగ్రహీతలు పొందవచ్చో తెలుసుకుందాం.

ఇదీ సంగతి..

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వివరాల ప్రకారం 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్ ఆన్ యూపీఐ' అనేది ఆర్బీఐ విజన్‌కు అనుగుణంగా అభివృద్ధిపర్చిన ఓ సరికొత్త ఆర్థిక వెసులుబాటు. దీనిద్వారా బ్యాంకుల నుంచి వ్యక్తులు, వ్యాపారులు తక్షణ రుణాలను పొందవచ్చు. యూపీఐ ద్వారా లావాదేవీల కోసం ఈ రుణాలను వెంటనే వినియోగించుకోవచ్చు. అయితే యూపీఐ యాప్స్ ద్వారా క్రెడిట్ లైన్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలనుకుంటే ముందుగా మీకు సేవింగ్స్ ఖాతా (యూపీఐ యాప్స్‌కు లింకై ఉన్న సేవింగ్స్ అకౌంట్) గల బ్యాంక్ నుంచి ఆమోదం పొందాలి. ఇందుకోసం ఓ అప్లికేషన్‌ను బ్యాంక్‌లో సమర్పించాలి. అప్పుడు బ్యాంక్ మీ అర్హత, ఆదాయం, క్రెడిట్ స్కోర్, రుణ చరిత్రను పరిశీలిస్తుంది. ఈ క్రమంలో ఆదాయం, గుర్తింపు, చిరునామా, ఇతరత్రా అవసరమైన డాక్యుమెంట్లను బ్యాంక్‌కు సమర్పించాల్సి ఉంటుంది. అన్నింటినీ పరిశీలించిన తర్వాత బ్యాంక్ ఆమోదిస్తే మీకు క్రెడిట్ లైన్ సౌకర్యం లభిస్తుంది. అవసరం ఉన్నప్పుడు దీన్ని ఉపయోగించుకోవచ్చు.

ఎలా లింక్ చేసుకోవాలి?

ఎన్‌పీసీఐ వెబ్‌సైట్ ప్రకారం తొలుత గూగుల్ ప్లే స్టోర్ నుంచి యూపీఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఒకవేళ మీ స్మార్ట్‌ఫోన్‌లో ఇప్పటికే ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం తదితర యూపీఐ యాప్‌లు ఉన్నట్లైతే మళ్లీ ఏ డౌన్‌లోడ్‌లూ అవసరం లేదు. ఉదాహరణకు ఫోన్‌పేలోకి లాగిన్ అయిన తర్వాత పైన కుడివైపు చివర్లో కనిపించే రౌండ్ బాక్స్‌లో ఉన్న కొశ్చన్ మార్క్‌పై క్లిక్‌చేస్తే ఓ కొత్త పేజీ ఓపెన్ అవుతుంది. అందులో ప్రొఫైల్ అండ్ పేమెంట్స్ ఆప్షన్ ఉంటుంది. దానిపై క్లిక్‌చేసి పేమెంట్స్ మెథడ్స్‌ను ఎంచుకోవాలి. అందులో మీకు యూపీఐ క్రెడిట్ లైన్ ఆప్షన్ ఉంటుంది. దాన్ని ఎంచుకొంటే మీకు క్రెడిట్ లైన్ సౌకర్యాన్ని కల్పించిన బ్యాంక్ కనిపిస్తుంది. దానిపై క్లిక్‌చేసి పిన్ నెంబర్ ద్వారా పేమెంట్స్‌ను పూర్తి చేయవచ్చు. అలాగే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఫోన్‌పే తదితర యాప్‌ల ద్వారా కూడా బై నౌ-పే లేటర్ సదుపాయాలు లభిస్తున్నాయి.

గుర్తుంచుకోండి..

ఈ క్రెడిట్ లైన్ రీపేమెంట్స్.. బ్యాంకునుబట్టి ఒక్కో రకంగా ఉంటాయి. అలాగే మీ ఖాతాలో నగదు నిల్వలు లేకపోయినా రుణం ద్వారా మీ అవసరాలను యూపీఐ పేమెంట్స్‌తో చేసుకుంటున్నందున దీనికి వడ్డీ రేట్లు కూడా ఎక్కువే ఉంటాయి. ఇక అప్రమత్తంగా లేకపోతే సైబర్ మోసాలకూ తావుంటుంది.

లాభాల స్వీకరణకు అవకాశం!

మార్కెట్ పల్స్



దేశీయ స్టాక్ మార్కెట్లలో లాభాల జోష్ కనిపిస్తున